క్లుప్తంగా

మొబైల్ అప్పగింత



బాధితుడికి మొబైల్ అప్పగిస్తున్న ఎస్సై

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతానికి చెందిన అరవింద్‌కుమార్ అనే యువకుడు గత సంవత్సరం అక్టోబర్‌లో బైక్ పై వెళ్తూ మొబైల్ పోగొట్టుకున్నాడు. అదే రోజు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ సాంకేతిక పరిజ్ఞానంతో వెతికి మొబైల్‌ను కనిపెట్టి శుక్రవారం బాధితుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మొబైల్ వాడే వారు జాగ్రత్త వహించాలని, పోగొట్టుకున్నట్లైతే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

కల్తీ కల్లు, గంజాయి నిర్మూలనపై ప్రచారం

మందమర్రిరూరల్: పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్తీకల్లు, గంజాయి మత్తు పదార్థాల నిషేధంపై పోలీసులు దృష్టి సారించారు. పట్టణంలో పలు కూడళ్లు, పాఠశాల వద్ద మత్తు పదార్థాలను వాడితే ఎలాంటి దుష్ఫలితాలు సంభవిస్తాయో వివరించే పోస్టర్లను అంటించారు. ఎస్సై రాజశేఖర్ పలువురు యువకులకు పోస్టర్ల వద్ద అవగాహన కల్పిస్తూ దాని పర్యవసానం తెలియజేశారు. కల్తీకల్లు, గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు.

హనుమాన్ భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు ఒడ్డుగూడం గ్రామాలకు చెందిన హనుమాన్ భక్తులు శుక్రవారం సాయంత్రం పాదయాత్రగా కొండగట్టుకు పయనమయ్యారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో బిక్ష, ప్రత్యేక పూజలు చేసి ఊరు దాటి బయలుదేరారు. ఐదు రోజుల్లో కొండగట్టుకు చేరనున్నట్లు స్వాములు పేర్కొన్నారు. పాదయాత్రలో గురుస్వాములు, కన్యస్వాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న బాల్క సుమన్

జైపూర్: మండలంలోని టేకుమట్ల ఎంపీటీసీ బడుగు రవి తండ్రి భానయ్య రెండ్రోజుల క్రితం మృతి చెందగా వారి కుటుంబాన్ని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ శుక్రవారం పరామర్శించారు. భానయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయనతో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రిక్కుల మధుకర్‌రెడ్డి, స్థానిక నాయకులు మేతి తిరుపతితో పాటు పలువురు ఉన్నారు.

శివాలయంలో పూజలు

చెన్నూర్: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ నామినేషన్ వేస్తున్న సందర్భంగా స్థానిక శివాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గడ్డం వివేక్ వెంకటస్వామి ముందుగా శివాలయంలో పూజలు చేసి నామినేషన్ దాఖలు చేశారు. తండ్రి సెంటిమెంట్ ప్రకారం తనయుని నామినేషన్ కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హిమవంతరెడ్డి, తంగెళ్లపల్లి అరుణ్‌కుమార్, చెన్న సూర్యనారాయణ, రఘునాథ్‌రెడ్డి, కొరకొప్పుల అజయ్‌గౌడ్, అక్కల రాజన్నలు పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

వేమనపల్లి: నీల్వాయి గ్రామ శివారులో ఉన్న వెంకటేశ్వర ఆలయం వద్ద భక్తుల తాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. స్థానికుడైన మాజీ ఉపసర్పంచ్ పుప్పిరెడ్డి తిరుపతిరెడ్డి, పుష్పలత దంపతుల సొంత ఖర్చుతో తాగునీటి బోరు వేయించేందుకు ముందుకు వచ్చారు. ఎంపీటీసీ సంతోష్‌కుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ, మాజీ సర్పంచ్ గాలి మధు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు..!

- గుంపులుగా సంచరిస్తూ వాహనదారులపై దాడులు
- బయటికెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- శునకాల నియంత్రణపై పట్టించుకోని అధికారులు



రైల్వే రడగంబాల బస్తీ రోడ్డుపై గుంపుగా ఉన్న వీధి కుక్కలు

బెల్లంపల్లి: ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్లపై, వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాహనదారులపై, పాదాచారులపై దాడులకు తెగబడుతున్నాయి. వీటి సంచారాన్ని నివారించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కనీస చర్యలు కూడా పాటించకపోవడంతో శునకాల సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది.

దాడులకు సిద్ధపడుతున్న శునకాలు...

మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా వీధి కుక్కలు సంచారం చేస్తున్నాయి. ఒక్కో బస్తీలో పదుల సంఖ్యలో ఉన్న శునకాలు ప్రస్తుతం వందల సంఖ్యలో ఉన్నాయి. బస్తీల్లోని కూడళ్ల వద్ద, వీధుల్లో, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ తచ్చాడుతున్నాయి. ఒక్కో గుంపులో పదికి పైగా శునకాలు ఉంటున్నాయి. ఆయా బస్తీల్లోని రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న పాదాచారులపై దాడులు చేస్తున్నాయి. వెంటబడి తరుముతున్న ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. అదేతీరుగా బైక్ వెంట పరుగెత్తుకెళ్లి రక్కడానికి యత్నిస్తున్నాయి. శునకాల బెడదతో వృద్ధులు, మహిళలు, చిన్నారులే కాకుండా యువకులు సైతం భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

కట్టడి చర్యలేవీ...?

కోర్టు ఆదేశాల ప్రకారం వీధి కుక్కలను వధించే అవకాశాలు లేకుండా ఉండగా కనీసం కట్టడి చేసే చర్యలు కూడా తీసుకోవడం లేదు. శునకాలు దాడి చేయకుండా నియంత్రించడం, ఊరికి దూరంగా వదిలేయడం, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించడం, సమయానుకూలంగా వీధి కుక్కలకు టీకాలు ఇప్పించడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉండగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల వీధి కుక్కలకు జబ్బులు వస్తున్నాయి. చర్మ సమస్యలు ఏర్పడుతున్నాయి. కుక్క కాటు వల్ల రేబీస్ వ్యాధి సంక్రమించే అవకాశాలు మెండుగా ఉన్నా, ఆ దిశగా కట్టడి చర్యలకు పాల్పడకపోవడంతో పురప్రజలు భయంభయంగా గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కొన్ని ఘటనలు...

- రెండు నెలల క్రితం బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఏఎంసీ ఏరియా నుంచి బజారుఏరియా వైపునకు వస్తుండగా ఆకస్మికంగా కొన్ని వీధి కుక్కలు వెంటబడటంతో ఆ తొందరపాటులో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టి గాయపడ్డారు.
- పాతిక రోజుల క్రితం బూడిదగడ్డ బస్తీ వైపు నుంచి బైక్‌పై వస్తుండగా కాంటా చౌరస్తా వద్ద గుంపుగా ఉన్న శునకాలు దాడికి ఎగబడటంతో అదుపు తప్పి వాహనదారుడు కిందపడిపోయి స్వల్పంగా గాయపడ్డాడు.
- నెల రోజుల క్రితం డబ్బుసేట్ లైన్‌లో ఓ బైక్ వెంట పడి వీధి కుక్కలు వాహనదారుడిని రక్కాయి.
- కూరగాయల మార్కెట్ ఏరియాలో సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి.
- షంషీర్‌నగర్‌లో పక్షం రోజుల క్రితం దారెంట వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చాయి.
- బాబు క్యాంపు బస్తీ నుంచి బజారు ఏరియాకు వస్తున్న కొందరు వ్యక్తులపై రోడ్డు పక్కన మాటు వేసి పక్షం రోజుల క్రితం వెంబడించి భయభ్రాంతులకు గురి చేశాయి.

ఏ చోట చూసినా ...

వీధి కుక్కలకు ప్రతి ప్రాంతం నిలయంగా మారింది. బజారు ఏరియా ప్రాంతం ఇందుకు ప్రసిద్ధిగాంచింది. కాంటా చౌరస్తా, కూరగాయల మార్కెట్, డబ్బుసేట్ లైన్ (రోడ్ నెంబర్-3), టేకులబస్తీ, తిలక్‌స్టేడియం ఏరియా, కొత్త బస్టాండ్ ఏరియా, కన్నాల బస్తీ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, బెల్లంపల్లి బస్తీ, పోచమ్మ గుడి వద్ద, బూడిదగడ్డ బస్తీ, బాబుక్యాంపు బస్తీ, సింగరేణి కళావేదిక వద్ద, హన్మాన్ బస్తీ, రాంనగర్ బస్తీ, నంబర్-2 ఇంక్‌లైన్ బస్తీ, సుభాష్‌నగర్ బస్తీ, శాంతిఖని, 65 డీప్ ఏరియా, రైల్వే రడగంబాల బస్తీ, స్టేషన్ రోడ్ కాలనీ, మహ్మద్ ఖాశీం బస్తీ, 24 డీప్ ఏరియా, రైల్వేస్టేషన్ ఏరియా, పెద్దనపల్లి, కాల్‌టెక్స్, అశోక్‌నగర్, అంబేద్కర్ నగర్, షంషీర్ నగర్, రవీందర్ నగర్, గాంధీనగర్, షంషీర్‌నగర్ తదితర బస్తీలు శునకాలతో నిండి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

త్వరలో నియంత్రణ చర్యలు తీసుకుంటాం

ఈ విషయం నా దృష్టికి వచ్చింది. వీధి కుక్కలను చంపేయడానికి వీలు లేదు కానీ, నియంత్రణ చర్యలు తీసుకుంటాం. కొద్ది రోజుల వ్యవధిలో కార్యాచరణ ప్రారంభిస్తాం. గుంపులుగా సంచరిస్తున్న శునకాలను పట్టుకుని, అడవి ప్రాంతంలో వదిలేస్తాం. ఒకవేళ అది సాధ్యం కాకపోతే వీధి కుక్కల సంతతి పెరగకుండా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తాం. ప్రజలపై దాడులు చేయకుండా తగిన నివారణ చర్యలు తీసుకుంటాం.



– గోపు మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్

బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వస్తే బీసీ భవనాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చిందని, వారు ఇచ్చిన మాట ప్రకారం బీసీ భవనాలు నిర్మించి బీసీల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌సింగ్, మహేష్, కొంతం రాజు, సతీష్, ఆరెందుల రాజేశం పాల్గొన్నారు.

సుమలతకు డాక్టరేట్ ...

మందమర్రిరూరల్: పట్టణానికి చెందిన గాదం సుమలత ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించింది. మధ్యప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఎక్స్‌ట్రాక్షన్ మోడల్ ఫర్ సైంటిఫిక్ ఆర్టికల్ యూజింగ్ మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్ లో పరిశోధన పూర్తి చేసి యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా పొందారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ.. 20ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో అనుభవం ఉందని ప్రస్తుతం సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాని తెలిపారు.

దేవతా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు



యాగశాలలో ప్రత్యేక పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాళ్లపేట్ రోడ్ నంబర్-1లో నూతనంగా నిర్మించిన శివపంచాయతన క్షేత్రంలో దేవతా విగ్రహ ప్రాణప్రతిష్ఠ పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు స్థాపిత పూజలు, యాగశాల ప్రవేశం, అఖండ దీపా స్థాపన, అగ్నిప్రతిష్ఠ స్థాపిత దేవతా హవనములు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు మధుశంకర్‌శర్మ, భరద్వాజ్‌శర్మ, శ్రీరాంభట్ల శశాంక్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనిచేసిన చోట గుర్తింపు తెచ్చుకోవాలి



దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాసిపేట: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, తాను చేసిన సేవలతోనే గుర్తింపు ఉంటుందని మండల నోడల్ ఆఫీసర్ రమేష్ రాథోడ్ తెలిపారు. మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సుదీర్ఘ కాలం పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన దామోదర్‌రెడ్డిని పాఠశాల, మండలంలోని ఉపాధ్యాయులు శుక్రవారం పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ధర్మరావుపేట స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్‌నాయక్, రిటైర్డ్ హెచ్‌ఎంలు కృష్ణభాస్కర్, జయప్రకాష్, నరసింహారెడ్డి, టీపీయూఎస్ నాయకులు బండి రమేష్, సురేష్‌బాబు, అమ్జద్‌పాషా, లచ్చన్న, రాజేశం, రాజేష్, అనిత, మహేష్, రజిత, సీసీవో రాంబాబు, దేవాపూర్ స్కూల్‌కాంప్లెక్స్ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్

భీమారం: కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి లంబాడాలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి వంశీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాడేటి రవి, బుక్యా లక్ష్మణ్, కొమ్ము శ్రీనివాస్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

పెద్దపల్లికి తరలిన మద్దతుదారులు



వంశీకృష్ణ నామినేషన్‌కు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల ముఖ్య నాయకులు, శ్రేణులు శుక్రవారం పెద్దపల్లికి తరలివెళ్లారు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. ఆయనకు సంఘీభావంగా బెల్లంపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, శ్రేణులు మేకల శ్రీనివాస్, బండి రాము, రామగిరి శ్రీనివాస్, ఎల్ .శ్రీనివాస్, ప్రతాప్, రియాజ్ లక్ష్మణ్‌సింగ్, మల్లేష్, డేవిడ్ తదితరులు వెళ్లి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఇతర శ్రేణులు తరలివెళ్లారు.

మందమర్రిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ నామినేషన్ వేస్తున్న సందర్భంగా శుక్రవారం మందమర్రి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పెద్దపల్లికి తరలివెళ్లారు. అభ్యర్థి వెంట ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరామారావు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు నరేష్ తదితరులు ఉన్నారు. మందమర్రి నుంచి తరలివెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు నీలయ్య, నాయకులు సుదర్శన్, రాంచందర్, జీవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా...

పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా శుక్రవారం మందమర్రి నుంచి అధిక సంఖ్యలో బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, సంపత్, రాజశేఖర్, అబ్బాస్, సూరిబాబు, శంకర్, తిరుపతిరెడ్డి, ఈశ్వర్, రేఖ, రైసాబాను ఉన్నారు.

దండేపల్లి: పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం నామినేషన్ వేశారు. దీంతో ఆయనకు మద్దతు తెలిపేందుకు దండేపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో పెద్దపల్లికి తరలివెళ్లారు.

భారీ చేరికలకు సన్నాహకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో 22వ తేదీ సోమవారం కాంగ్రెస్‌లో చేరికలకు కాంగ్రెస్ పార్టీ భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోంది. హాజీపూర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెందిన తాజా మాజీ, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పలువురు సీనియర్ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకోనున్నారు. వీరంతా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్‌వెంకటస్వామి, గడ్డం వినోద్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కూడా ఈ చేరికల కార్యక్రమానికి హాజరుకానుండగా ఇప్పటికే మండలంలో ఈ చేరికల కార్యక్రమంపై రసవత్తర చర్చ సాగుతుండగా ఎవరెవరు చేరుతున్నారనే విషయాలపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చేరికలపై కొంత మంది స్పష్టతగా ఉన్నా, మరికొంత మంది ఆ రోజు వరకు ఒక్కసారిగా పార్టీలో చేరేందుకు సంసిద్ధమవుతున్నారు. మొత్తంగా ఇప్పటికే హాజీపూర్ మండలంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా ఈ భారీ చేరికల కార్యక్రమంతో మండంలో ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కానుందని పలువురు గుసగుసలాడటం కొసమెరుపు.

పనులు చేసినా బిల్లులివ్వలే..!

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'మనఊరు–మనబడి'లో గత సంవత్సరం రూ.4 లక్షలతో చేపట్టిన పనులకు ఇప్పటి వరకు అధికారులు బిల్లులు మంజూరు చేయడంలేదని మాజీ సర్పంచ్ గోదరి తిరుపతి శుక్రవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి మరీ పాఠశాల భవనానికి మరమ్మతులతో పాటు విద్యుద్దీకరణతో పాటు ఫ్యాన్లు బిగించినట్లు వాపోయారు. వంటషెడ్డు, ప్రహరీ నిర్మించామని తెలిపారు. పనులు అయిన అనంతరం కొంత బిల్లుకు సంబంధించిన డబ్బులు బ్యాంకులో జమ అయినప్పటికీ, అధికారులు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో దళిత కులానికి చెందిన వ్యక్తిననే ఉద్దేశంతో అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా డబ్బులు చెల్లించకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తానని హెచ్చరించారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

జన్నారం: ఎండలు తీవ్రమౌతున్నందునా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శశికళ అన్నారు. మండలంలోని పొనకల్‌లో నీటిట్యాంకు, నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. మొక్కలకు నీడ, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. చెడిపోయిన చేతి పంపులను మరమ్మతు చేయించాలని, అవసరం అనుకుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఎంపీవో రమేశ్, కార్యదర్శి ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నస్పూర్‌కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథ్

నస్పూర్: బీజేపీతోనే పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం అవుతుందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. పట్టణ పరిధిలోని షిర్కే, నస్పూర్ కాలనీలో శుక్రవారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక ఎంపీ సీట్లు సాధిస్తుందని, మోడీ మళ్లీ ప్రధాని అవుతాడని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్రం రమేష్, పబ్బతినేని కమలాకర్‌రావు, పానుగంటి మధు, కుర్ర చక్రి, ఈర్ల సధానందం, రణదీప్, పద్మ, అనూష, మహేశ్వరి, జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో బీజేపీ ప్రచారం

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లిలో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాని కోరారు. బీజేపీ నాయకులు ఎంబడి సురేందర్, నలిమెల మహేశ్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాయిపేటలో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని రాయిపేట గామంలోని బూత్ నంబర్ 155లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేపట్టారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు చెవ్వ రాజ్‌కుమార్, యువకులు పాల్గొన్నారు.

'మోదీని మూడోసారి ప్రధానిని చేయాలి'

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. రానున్న ఎంపీ ఎన్నికలలో పెద్దపెల్లి పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కేంద్రంలో మరోసారి బీజేపీని అధికారంలోకి తెచ్చి మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్టా ఈశ్వరాచారి, ధన్‌సింగ్, బంగారి వేణుగోపాల్, కళాధర్‌రెడ్డి, వైద్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. సుమతి తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ట్రైనింగ్ కం ప్లేస్‌మెంట్‌లో భాగంగా కళాశాలలో చదువుతున్న 24 మంది విద్యార్థినులు టీఎస్‌డబ్ల్యూ ఆర్డీసీ కరీంనగర్‌లో ఈ నెల 1 నుంచి 6వ తేదీ వరకు ఆరు రోజుల పాటు శిక్షణ తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 14 మంది విద్యార్థినులు వివిధ కంపెనీ ఇంటర్వ్యూలలో ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కె. శివలీల, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ ఎం.రజిత, అధ్యాపక బృందం అభినందించారు.

పంచముఖి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



హోమం చేస్తున్న నిర్వాహకులు, సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి షంషీర్‌నగర్ బస్తీలో ఉన్న శ్రీ పంచముఖి ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చి ఎనిమిది మంది వేద పండితులు ముందస్తుగా హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన నిర్వాహకులు ఆనంద్‌లోయ, అజయ్‌కుమార్ లోయ, ధ్వజస్తంభం దాత రాగం శెట్టి సత్యనారాయణ తదితరులు భక్తి ప్రపత్తులతో హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మల్లోజుల విజయ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, ప్రభాకర్, రమేష్, కుంబాల రాజేష్, కోయిల్‌కర్ గోవర్దన్, రాజశేఖర్, శ్రీరాములు, చిప్పమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జంతుశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



కృష్ణగోపాల్ రావు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న దారిశెట్టి కృష్ణగోపాల్ రావుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లోని గ్లోకల్ యూనివర్సిటీ నుంచి జంతుశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీని ప్రదానం చేశారన్నారు. ఆచార్యులు డాక్టర్ వశింధర్ సింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో పునరుత్పత్తి ఆరోగ్యం గురించి కౌమార అవగాహన వైఖరిపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు జగ్‌పాల్, విద్యార్థులు అభినందనలు తెలిపారు.